# ప్రజాసమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి

-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలు తప్పనిసరిగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలుచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ నగేష్, జడ్పి సిఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరావులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. దరఖాస్తులను సంబంధితశాఖవారికి అందజేస్తూ త్వరితగతిన ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి పరిష్కరించాలన్నారు. సోమవారం గ్రీవన్స్‌కి 97 దరఖాస్తులు రాగా, భూసమస్యలు33, ఇందిరమ్మ ఇళ్లకొరకు20, పింఛన్‌కొరకు5, ఇతరసమస్యలు39 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈసందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ ప్రజాసమస్యలపరిష్కారమే ధ్యేయంగా కృషిచేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమపథకాలు ప్రజలకు అందించేవిధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

**వార్త**

# స్వచ్ఛందంగా కల్వర్టు ఏర్పాటు చేసుకున్న రైతులు

**నారాయణఖేడ్, జూన్ 30, ప్రభాతవార్త:**
నర్సాపూర్‌లో పొలాలకు వెళ్ళడానికి వాగుదగ్గర ఇబ్బంది కలగకుండా రైతులు కల్వర్ట్ నిర్మించుకున్నారు. గత పదిసంవత్సరాలుగా కల్వర్టు లేకపోవడం వల్ల వర్షాకాలం వచ్చింది అంటే రైతులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వచ్చేదని రైతులు తెలిపారు. ట్రాక్టర్ వెళ్లాలన్నా, మందుసంచులు తీసుకు వెళ్లాలన్నా, పొలాలకు లేబర్‌ను తీసుకెళ్లాలి అన్నా, చాలా ఇబ్బంది కలిగేదని రైతులు ఆలోచన చేసి 32మంది రైతులు కలిసి ట్రాక్టర్, ఇతర వాహనం వెళ్ళేలాగా వంతెన ఏర్పాటు చేసుకున్నట్టు రైతులు తెలిపారు. పొలాలకు వెళ్లే సమయంలో వాగు దాటేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారన్న ఆలోచనతో ఈకార్యక్రమం చేపట్టామని అన్నారు. ఇప్పుడు పొలాలకు వాహనాలు వెళ్ళడానికి ఇబ్బంది ఉండదు అని రైతులు అన్నారు.

# ఆదిలక్ష్మి ఆశ్రమంలో వారాహీదేవి నవరాత్రి ఉత్సవాలు

-పాల్గొని పూజలు చేసిన ఎంపి, మాజీ మంత్రి



వారాహీదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపి, మాజీ మంత్రుల దృశ్యం

**న్యాల్‌కల్, జూన్ 30, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులోని శ్రీఆదిలక్ష్మి ఆశ్రమంలో కొనసాగుతున్న శ్రీ వారాహీదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, మాజీమంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌లు హాజరై ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్‌షెట్కార్, జిల్లా అధ్యక్షులు నరేశ్‌గౌడ్, ఇండస్ట్రియల్ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు రామ లింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, కేతకి సంగమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, నాయకులు హుగ్గెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయండి

-కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ఎబివిపి నాయకులు



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎబివిపి నాయకులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 30, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రామయంపేటశాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు బండారి ప్రశాంత్ మాట్లాడుతూ రామాయంపేట పట్టణకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతనభవనం లేక విద్యార్థులు విద్యను కొనసాగించలేకపోతున్నారని, ఆర్డీఓ ఆఫీసులోని భవనంలో ప్రస్తుతం డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నందున, డిగ్రీ కళాశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరుతున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట నగర సంయుక్త కార్యదర్శి అర్జున్, ఎస్‌ఎఫ్‌డి కన్వీనర్ ఆదర్శ్, కార్యకర్తలు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కేసులలో శిక్షల శాతం పెంచాలి

-పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలి

-సిపి డాక్టర్ అనురాధ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**
కేసులలో శిక్షల శాతం పెంచాలని...క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చాలా ముఖ్యమని..పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సిపి డాక్టర్ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. సిపి కార్యాలయంలో సోమవారం పెండింగ్‌లో ఉన్న కేసులపై పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై మరింత నిఘాపెంచి గంజాయిరహిత జిల్లాకు కృషి చేయాలన్నారు. కేసులలో పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. ప్రోయాక్టివ్ పోలీస్‌సింగ్‌పై దృష్టి సారించి నేరాలను తగ్గించాలన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసులపరిశోధనలో నూతనటెక్నాలజీని ఉపయోగించాలన్నారు. డయల్ 100 కాల్‌పై త్వరగా స్పందించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు సుభాష్‌చంద్రబోస్, రవీందర్‌రెడ్డి, నరసింహులు, సదానందం, రవీందర్, శ్రీనివాస్, కిరణ్, శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, వాసుదేవరావు, విద్యాసాగర్, ఉపేందర్, శీను, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో సిటీ సెంటర్ ఆసుపత్రి ఏర్పాటు

-ఆసుపత్రిని ప్రారంభించిన ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్



సిటీ సెంటర్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంపి సురేష్‌శెట్కార్

**జహీరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంలో అధునాతన సౌకర్యాలు, హంగులతో ఏర్పాటు చేసిన సిటీ సెంటర్ ఆసుపత్రిని సోమవారం జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌లు పాల్గొని ఎంపితో కలిసి ఆసుపత్రిలోని ఆయా విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిచాలని ఆసుపత్రి బాధ్యులకు ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి యజమానులు, కాంగ్రెస్ నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆరాధనరెడ్డి, డాక్టర్ జాన్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరిగిన కరెంటు కష్టాలు

-నిరంతర విద్యుత్ కోతలతో పట్టణప్రజల అవస్థలు

-చిరువ్యాపారులకు తప్పని నష్టాలు

-రామాయంపేటలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తం




రామాయంపేట ట్రాన్స్‌కో కార్యాలయం

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ కష్టాలు మరింత ఎక్కువయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి విద్యుత్ అంతరాయాలు చాలాతక్కువగా ఉండేవని,ఇప్పుడు విద్యుత్‌కోతలు నిత్యకృత్యంగా మారాయన్న విమర్శలుపెరిగాయి. పాలనమారినా తమ కష్టాలు తీరకపోగా, మరింత పెరిగాయని ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనిర్వహణాలోపం, అధికారుల నిర్లక్ష్యం, సరఫరాలో అంతరాయం, వెరసి రామాయంపేట పట్టణం నిరంతర విద్యుత్‌కోతలతో అంధకారంలో మునిగిపోతోంది. కరెంటు ఎప్పుడు వస్తుందో? ఎప్పుడు పోతుందో? తెలియక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్వహణాలోపం, నిర్లక్ష్యమే ఈదుస్థితికి కారణమని పట్టణప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గతనెలలో జరిగిన విషాదఘటన ఈ సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. కరెంట్‌షాక్‌కు గురై పట్టణానికి చెందిన గాయంతి మల్లేశం అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయినప్పటికీ, అధికారులు కళ్లుతెరవలేదన్న ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు. రామాయంపేటలో కరెంటుకష్టాలు ప్రజల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఒక్కో రోజు ఉదయంనుండి సాయంత్రంవరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న దుకాణాలు, వ్యాపారసంస్థలు కరెంటులేక మూతపడుతున్నాయి. ఉదయంనుండి సాయంత్రంవరకు తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, బేకరీలో తినుబండారాలు, శీతలపానీయాలు పాడవుతున్నాయి. కటింగ్ సెలూన్లు, టైలరింగ్ షాపులు, జిరాక్స్ సెంటర్లు, బ్యూటీ పార్లర్‌లు, మెకానిక్ దుకాణాలు, మోటార్ వైండింగ్ షాపులు వంటివి కరెంటులేక గంటల తరబడి మూసివేయాల్సి వస్తోంది. దీంతో చిరువ్యాపారులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో, అపార్ట్‌మెంట్ల లోని లిఫ్ట్‌లు పనిచేయడంలేదు. దీంతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, దివ్యాంగులు మెట్లు ఎక్కలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఎగువ అంతస్తుల్లో నివసించేవారు బయటకు వెళ్లాలన్నా, తిరిగి ఇంటికి రావాలన్నా నరకం చూస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విద్యుత్ అంతరాయాలవల్ల పనులు నిలిచిపోతున్నాయని, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పని చేయకపోవడంతో ఫైళ్లు పేరుకుపోతున్నాయని, కార్యాలయాల పనితీరుపై తీవ్రప్రభావం చూపుతోందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. కరెంటుకోతలతో నీటిసరఫరా నిలిచిపోయి తాగు నీటి సమస్య తీవ్రమవుతోందని, వేసవికాలంలో ఈసమస్య మరింత ఎక్కువ అవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండాపోతోందని, ప్రజలు ఫిర్యాదుచేస్తే, వారికి నిర్లక్ష్యపు సమాధానాలు లభిస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలో విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలు అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మల్లేశం అనేవ్యక్తి మరణించినా, అధికారులు నిర్లక్ష్యంగానేవ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఓవైపు ప్రాణాలుపోతున్నా, మరోవైపు దైనందినజీవితం స్తంభిస్తున్నా అధికారులు చోద్యంచూస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈసమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, రామాయంపేట ప్రజల విద్యుత్ కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి దరఖాస్తును పరిష్కరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

-జిల్లా కలెక్టర్ హైమావతి



దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించి శనివారంలోగా ఆన్‌లైన్ పొందుపరచాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి స్వీకరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖల వారిగా వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేసి ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. సమీక్షాకు హాజరు కానీ జిల్లా అధికారుల నుంచి సంజాయి కోరాలని కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధశాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ ఇద్దరు మృతి..

-వేగం ఇద్దరిని బలిగొంది

ఆటో, బస్ ఢీకొన్న దృశ్యం



**మెదక్ టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:**
ముందుగా వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు వెళ్లగా ఆర్టీసీ బస్‌ను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతిచెందారు. ఈవిషాదకర ఘటన మెదక్‌మండలం మంబోజిపల్లి శివారులోని ఎన్‌ఎస్‌ఎఫ్‌ఫ్యాక్టరీ వద్ద సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లికి చెందిన శ్రీకాంత్ (26), కౌడిపల్లికి చెందిన నరేష్ (25)లో ఆటోలో మెదక్ వస్తున్నారు. ఆటో నడుపుతున్న శ్రీకాంత్ ఎన్‌ఎస్‌ఎఫ్ వద్ద ముందుగా వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు ఆటో వేగంపెంచి నడిపాడు. కాని ముందుగా వస్తున్న ఆర్టీసీ బస్‌ను చూడకపోవడంతో దాన్ని ఢీకొట్టాడు. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో బస్సును ఢీకొట్టి నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ఉన్న శ్రీకాంత్, నరేష్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. వేగం వలనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

# సహాయక చర్యలు పరిశీలించిన కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో 30, ప్రభాతవార్త:**
ఇస్నాపూర్ మండలం పాశ మైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా కంపెనీలో సోమవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదస్థలాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు చేపట్టిన సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించేందుకు తక్షణచర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారులకు ఆదేశించారు. తక్షణసహాయం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు అవసరమైన సమాచారం కోసం 08455276155 నెంబర్‌కు సంప్రతించవచ్చని కలెక్టర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికిగల కారణాలపై పరిశ్రమలశాఖ, పోలీస్, అగ్ని మాపకశాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా పరిశీలన చేపట్టి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్, కార్మికశాఖ, పోలీస్‌శాఖ, వైద్యశాఖ, రెవెన్యూశాఖ, వివిధ సంబంధితశాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

-క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



సహాయకచర్యలపై మానిటరింగ్‌చేస్తున్న కలెక్టర్ పి.ప్రావీణ్య

# వృద్ధురాలి ఇంట్లోనచొరబడి బంగారుగుండ్లు చోరీ

-చోరీకి పాల్పడ్డ మహిళకు గ్రామస్థుల దేహశుద్ధి



బాధితురాలి పక్కన సర్కిల్‌లో ఉన్నది మహిళాదొంగ

**టేక్మాల్, జూన్ 30 ప్రభాతవార్త:**
ఇంట్లో ఎవరూలేని సమయం చూసి ఓ వృద్ధురాలి మెడలోంచి బంగారు గుండ్లను దొంగలించిన సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఈ విధంగా ఉన్నాయి. బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన గంగమోళ్ల భూదెమ్మ(65) అనేవృద్ధురాలు ఇంట్లోపడుకొని ఉండగా నారాయణఖేడ్‌మండలం, హనుమంతరావుపేట్‌గ్రామానికి చెందిన సునంద అనే మహిళ ఇంట్లోకి చొరబడి భూదెమ్మ మెడలో ఉన్న బంగారు గుండ్లను లాక్కొనగా అవి రాకపోవడంతో చేతిలో ఉన్న బ్లేడుతోకోసి పరారయింది. వృద్ధురాలు భూదెమ్మ లబోదిబోమంటూ అరుపులు కేకలతో ఆమహిళను వెంబడించి బస్సు ఎక్కిన మహిళను కిందకు దించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మహిళాదొంగను చితకబాది దేహశుద్ధి చేశారు. వృద్ధురాలు మాట్లాడుతూ బాతురూం కావాలన్నది. సరే కానీలే అని చూపించిన ఆమెకు నీళ్లు ఇచ్చేందుకు వెళ్లిన నామెడలోని గుండ్లతాడును బ్లేడ్‌తోకోసి పారిపోబోయిందని రోదిస్తూచెప్పింది. దొంగ మహిళను, గుండ్లను, కారంపొడి కవర్‌ను, సెల్‌ఫోన్‌ను, ఆధార్‌కార్డును లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు తెలిపారు.

# గోలిపర్తి గ్రామంలో విష జ్వరాలు

-స్పందించిన అధికారులు



మురికికాలువల వద్ద చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న సిబ్బంది

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ పరిధి ఏడవ వార్డు గొలిపర్తి గ్రామంలో విష జ్వరాలు ప్రబలడంతో అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామాయంపేట మండల వైద్యాధికారి డాక్టర్ హరిప్రియతో పాటు, జిల్లా మలేరియా అధికారి, మున్సిపల్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని కమ్యూనిటీ భవన్ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు, గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జ్వరాలు వచ్చిన వారి వివరాలను సేకరిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. దోమల మందు స్ప్రే చేయడంతో పాటు పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. వారం రోజులపాటు హెల్త్ క్యాంప్ నిర్వహించాలని, గ్రామంలో సానిటేషన్ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీకి యత్నం

-బ్యాంకు వెనకగోడకు కన్నంవేసిన గుర్తుతెలియని దుండగులు

-సైరన్ మోగడంతో పారిపోయిన దుండగులు

**వెల్దుర్తి, జూన్ 30, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దోపిడీదొంగలు హల్‌చల్‌చేశారు. స్థానిక అంబేద్కర్‌చౌరస్తాలోని సెంట్రల్‌బ్యాంక్‌ఆఫ్‌ఇండియా వెనకవైపు బాత్రూంగోడకు కన్నంవేసి లోపలికిప్రవేశించి, కౌంటర్లలో డబ్బులకోసం వెతికారు. ఏమీ దొరకకపోవడంతో లాకర్‌రూమ్‌ను పగలగొట్టడానికి విఫల ప్రయత్నంచేశారు. దీంతో సైరన్‌మోగడంతో అక్కడినుండి దుండగులు పారిపోయారు. ఈవిషయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు తూప్రాన్ డిఎస్పి నరేందర్‌రెడ్డి, సిఐ రంగకృష్ణ, స్థానిక ఎస్‌ఐ రాజుతోపాటు పోలీసుబృందం ఘటనాస్థలానికి చేరుకున్నారు. అనంతరం బ్యాంకుపరిసరాలు, బ్యాంకును పరిశీలించారు. నిందితులకోసం సిసి కెమెరాలు పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు. ఈకేసును సవాల్‌గా తీసుకొని పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బ్యాంకులో ఎలాంటి నగదు పోలేదని బ్యాంక్ సిబ్బంది తెలిపారు. కాగా ఇదే బ్యాంకుకు దుండగులు కన్నం వేయడం ఇది రెండోసారి కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# నిరుపేదల కలలను నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**చిన్నశంకరంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
పేదవారికలను నిజం చేయడానికి ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలపరిధి ఎమ్మెల్యే స్వగ్రామమైన కొర్విపల్లిలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇళ్లనునిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం ప్రతి నిరుపేదకుటుంబానికి రూ.5లక్షలతో ఇళ్లనునిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన ప్రతిలబ్దిదారునికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని,ఎవరూ అధైర్యపడొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నియామకాలు, పేదలకు మెరుగైన వైద్యం, విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జీవన్, అరుణ, మోహన్‌నాయక్, రామచంద్రం, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

## సదుల లక్ష్మణ్‌కు దళితరత్న పురస్కారం



ఎస్ఆర్‌డి22,దళితరత్న ఆవార్డు అందుకుంటున్న సదుల లక్ష్మణ్

**సదాశివపేట,జూన్ 30(ప్రభాతవార్త):**
దళిత అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసే బేడా,బుడగ జంగం రాష్ట్ర నాయకులు సదుల లక్ష్మణ్‌కు దళిత రత్న రావడం హర్షనీయమని బిబిజెహెచ్‌పిఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు టేకూరి అంజయ్య అన్నారు.సోమవారం నాడు సదాశివపేటలో సన్మానించిన అనంతరం మాట్లాడారు.దళితుల కోసం లక్ష్మణ్ చేసిన అభినందనీయమన్నారు.ఆయన కృషిని గుర్తించి పురస్కారం అందజేయడం పట్ల అంబేద్కర్ ఉత్సవాల కమిటి రాష్ట్ర చైర్మన్ ఇటుక రాజుకు ధన్యవాదాలు తెలిపారు.గతంలో మెదక్,సిద్ధిపేట డివిజన్‌లలో బేడా బుడగజంగాలకు కులదృవీకరణ సర్టిఫికెట్ల కోసం తాము బుడగజంగం హక్కుల పోరాట సమితి అధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపట్టి సర్టిఫికెట్లు సాధించామన్నారు.లక్ష్మణ్‌కు ఈ పురస్కారం లభించడం కష్టపడ్డ వారికి గౌరవం దక్కిందన్నారు.దళాత రత్న ఆవార్డుతో ఆయనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

## మాచాపురం బాల్‌నర్సయ్యకు దళితరత్న అవార్డు



దళితరత్న అవార్డు అందుకుంటున్న మాచాపురం బాల్‌నర్సయ్య

**గజ్వేల్ టౌన్, జూన్ 30 (ప్రభాతవార్త):**
దళిత కళాకారునిగా, రచయితగా, దళిత బహుజన ఉద్యమకారునిగా గత 30 సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన మాచాపురం బాల్‌నర్సయ్యకు దళితరత్న అవార్డు లభించింది. హైద్రాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 27వ తేదీ శుక్రవారం తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అంబేద్కర్ జయంతి ఉత్సవాల వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు, విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షులు కళానిధి డాక్టర్ జి.మాస్టార్జీ, అంబేద్కర్ సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, టివైఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తలకొక్కుల రాజు, విశ్వజన కళామండలి జాతీయ ప్రధాన కార్యదర్శి యం.అనంతయ్య చేతులమీదుగా దళితరత్నఅవార్డును అందుకోవడం జరిగింది. బాల్‌నర్సయ్య ఇటుక రాజు, మాస్టార్జీ, బొద్దాన అప్పారావు, తలకొక్కుల రాజు, అనంతయ్యలకు ధన్యవాదాలు తెలిపారు.

## తమ గ్రామాల మీదుగా బస్సును నడిపించాలి



జీపిపి డిపో మేనేజర్‌తో మాట్లాడుతున్న నిమ్మ రంగారెడ్డి

**వర్గల్, జూన్ 30 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుండి వర్గల్ మండలంలోని నెంటూర్, తునికిఖాల్సా, మైలారం గ్రామాల మీదుగా సికింద్రాబాద్‌కు బస్సును నడిపించాలని ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ జులై రెండవ వారంలో బస్సును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిమ్మ రంగారెడ్డి, కొండల్‌గౌడ్, సదానంద్‌రెడ్డి, సాయిగౌడ్, కొండల్‌రెడ్డి, పోతగల్ల రవి, శ్రీహరిగౌడ్, సాయికుమార్‌గౌడ్, ఆయా గ్రామాల గ్రామస్తులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహానికి భూమి కేటాయించండి

**-తులసి దాస్**

**గుమ్మడిదల, జూన్ 30, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో శిధిల వ్యవస్థలో ఉన్న బాలుర వసతి గృహానికి శాశ్వత గృహనిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సోమవారం రోజున స్థానికనాయకులు మండల తులసీదాస్, తుడుం శ్రీనివాస్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలు నుండి వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహం గుమ్మడిదల కేంద్రంలో ఉన్నది ప్రస్తుతం అది శిథిల వ్యవస్థలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా ప్రస్తుతం అది బిఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్ కార్యాలయంలో వసతి గృహాన్ని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. శాశ్వత వసతి గృహం లేక విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే శాశ్వత గృహ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విప్లవాత్మక మార్పులకు మారుపేరు ప్రధాని మోడీ

**-మండల పార్టీ అధ్యక్షుడు నీల సత్యం**

**కొండపాక, జూన్ 30, ప్రభాతవార్త**
భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన 11సంవత్సరాల పాలనలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారని కొండపాక మండల బిజెపి అధ్యక్షుడు నీల సత్యం అన్నారు. సోమవారం దుద్దెడలో అయన వికసిత్ భారత్ సంకల్ప సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రధాన మంత్రిగా మోడీ ఉండడంవల్ల దేశ ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. నల్ల ధనాన్ని వెలికి తీసి నోట్ల రద్దు ద్వారా ఈ దేశాన్ని నాలుగో స్థానంలో నిలిపారని తెలిపారు. మహిళాల ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం ఇంటికో మరుగుదొడ్డిని నిర్మాణానికి చేయూత నిచ్చిన వ్యక్తి అయన అన్నారు. 370 ఆర్టికల్, అపరేషన్ సింధూర్‌లాంటి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి బారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన గొప్ప వ్యకి మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గడ్డమిది రామస్వామి, మంచాల శ్రీనివాస్‌గౌడ్, భాషమైన ప్రశాంత్, కూరెళ్ళ అభిలాష్‌రెడ్డి, అంజనేయులు, మునుగురి సురేష్, శ్రీహరి, తిరుపతి పాండు, గజ్వేల్ శ్రీకాంత్, బాలాజీ, అనిల్, సాయి, రాకేష్, చందు, వేణు, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుంది

**-తహసీల్దార్ దండి సుజాత**

**కొండపాక, జూన్ 30, ప్రభాతవార్త**
ప్రభుత్వ పాఠశాలల్లో అటపాటలతోపాటు నాణ్యమై విద్యను బోధించటం జరుగుతుందని తహసీల్దార్ దండి సుజాత అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండలకేంద్రంలోని ప్రాథమికపాఠశాలలో ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు సంబరాలను హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థినీవిద్యార్థులతోకలిసి గోరింటాకు పెట్టుకొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగానే సిగాచి ఘటన..

**-మృతులకు కోటి రూపాయల పరిహారం, ఉద్యోగం కల్పించాలి**
**-గాయపడ్డ వారికి 50 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలి**
**-పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**
**-అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

**పటాన్‌చెరు, జూన్ 30, ప్రభాతవార్త:**
యాజమాన్యం నిర్లక్ష్యం ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల తూతూ మంత్రంగా చేపట్టే తనిఖీల మూలంగానే సిగాచిపరిశ్రమ ఘటన చోటుచేసుకుందని. పేలుడులో మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, గాయపడిన వారికి మెరుగైన వైద్యంతోపాటు 50లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ పాశమైలారం పారిశ్రామికవాడలోగల సిగాచిపరిశ్రమలో సోమవారంఉదయం రియాక్టర్‌పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే జిఎంఆర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిఐజి ఇక్బాల్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పి పరితోష్ పంకజ్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 30సంవత్సరాలుగా పరిశ్రమ నడిపిస్తున్న సిగాచి యాజమాన్యం ఎప్పుడు కూడా కార్మికుల భద్రత కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలోకూడా ఇదే పరిశ్రమలో భారీపేలుడు సంభవించి పెద్దసంఖ్యలో మృతిచెందారని తెలిపారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన పరిశ్రమల తనిఖీల విభాగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను గాలికి వదిలేస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ఒకసారి ప్రమాద సంఘటన జరిగినప్పటికీ యాజమాన్యం గుణపాఠం నేర్చుకోకుండా తిరిగి భద్రతాప్రమాణాలు పాటించకుండా పరిశ్రమలు నడిపిస్తూ కార్మికులపాలిట యమపాశంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించి పూర్తిస్థాయిలో విచారణజరిపించి, ఘటనకు కారకులైన యాజమాన్యం, నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ విభాగం అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.

**ముమ్మరంగా సాగుతున్న సహాయక చర్యలు..**
**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి..**
**నీలం మధు ముదిరాజ్..**

ఇస్నాపూర్‌మున్సిపాలిటీ పరిధి పాశమైలారంలోని సిగాచిపరిశ్రమలో సంభవించిన ప్రమాదం బాధాకరమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధుముదిరాజ్ అన్నారు.

సోమవారం మంత్రులు దామోదర రాజ నరసింహ, వివేక్ వెంకటస్వామి, జిల్లా అధికారుల వెంట ప్రమాదస్థలాన్ని పరిశీలించడంతోపాటు వివిధ ఆసుపత్రులలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదం సంభవించినవెంటనే అప్రమత్తం అయిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. గాయపడిన 26మందికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అవసరమైతే మెరుగైన వైద్యంకోసం కార్పొరేట్ ఆసుపత్రులకు తరలించే విధంగా ప్రభుత్వంతరపున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు ప్రగాఢసానుభూతి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పటాన్చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ...**
**బాధితకుటుంబాలకు అండగా ఉంటాం..**
**పట్టభద్రుల ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి..**

**రామచంద్రాపురం, జూన్ 30, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గం పాశంమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాద సంఘటనలో మృతిచెందిన, క్షతగాత్రుల కుటుంబాలకు అండగా ఉంటామని పట్టభద్రులు ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ ప్రమాద సంఘటన వివరాలను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు 2లక్షలు, క్షతగాత్రులకు 50వేల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రమాద సంఘటనను జిల్లాకలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్‌లు సైతం పరిశీలించారన్నారు.

## 30 వసంతాల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి

**-ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్**



జిల్లానాయకులతో సమావేశమైన జాతీయ ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్

**అల్లాదుర్గం, జూన్ 30, ప్రభాతవార్త:**
జులై 7న ఎమ్మార్పీఎస్ 30వ వసంతాల దినోత్సవంను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ సూచించారు. సమవారం అల్లాదుర్గంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌కుమార్‌పాల్గొని ప్రసంగించారు. మందకృష్ణమాదిగ పోరాట ఫలితంగా వర్గీకరణ సాధ్యమైందని గుర్తుచేశారు. ప్రతిగ్రామంలో ఎమ్మార్పీఎస్ జండాలను ఆవిష్కరించి మాదిగసోదరులు ఎమ్మార్పీఎస్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. బిసి రిజర్వేషన్‌ల కొరకు ఎమ్మార్పీఎస్ పోరాటాలు చేయబోతోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు మురళి, జిల్లా నాయకులు బసన్నగారి బలరాం, బాలకృష్ణ, బి సాయిలు, రాజు, సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ డాక్టర్ దామోదర్ సేవలు అభినందనీయం

**-మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్**

**నర్సాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహించిన డాక్టర్ పి దామోదర్ అందించిన సేవలు అభినందనీయమని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేశారని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ అన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి దామోదర్ పదవీవిరమణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం నాన్ టీచింగ్ సభ్యులు విద్యార్థులు శాలువాలతో పూలమాలతో సన్మానించి సన్మానపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సమీరా, రమేష్, డాక్టర్ సురేష్ కుమార్, రుక్మిణి, హేమంత్, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

**-అతిక్రమిస్తే రెండేళ్ల జైలు**



జిల్లా పొగాకు నియంత్రణసూపర్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

**పటాన్‌చెరు, జూన్ 30, ప్రభాతవార్త:**
పటాన్ చెరువు బస్టాండ్ కేంద్రంలో పొగాకు నియంత్రణ పైన ర్యాలీ నిర్వహించి ప్రయాణికులతో ప్రతిజ్ఞ చేయించినారు. పలు పాన్‌షాపులు సందర్శించి పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలు పొగాకు తాగేవాళ్లకు వివరించారు సూపర్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి. స్థానిక బస్టాండ్ పరిసర ప్రాంతాల నందు పొగాకు ఉత్పత్తులు వాడకుండా అవగాహన కల్పించడం జరిగింది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని, అతిక్రమిస్తే జరిమానాతో పాటు రెండేళ్ల జైలు శిక్ష తప్పదని జిల్లా పొగాకు నియంత్రణ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు.

## ఎంపిని పరామర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షులు, నాయకులు

**నర్సాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
మెదక్ ఎంపి రఘునందన్‌రావును బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్‌తోపాటు బిజెపి నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో పరామర్శించారు. ఎంపి రఘునందన్‌రావు శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నుండి బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్‌తోపాటు బిజెపినాయకులు కలిసివెళ్లి ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్‌దాస్ రాధామల్లేష్‌గౌడ్‌తోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సిద్ధిరాములు, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు శేఖర్, జిల్లా బిజెపినాయకులు నారాయణరెడ్డి, జిల్లా ఎస్టీమోర్చా ప్రధాన కార్యదర్శి రాములునాయక్, మండల అధ్యక్షులు నాగప్రభుగౌడ్, పెద్దపులి రవి, అవినాష్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, నాగేష్‌గౌడ్, బీజేవైఎం నాయకులు అరవింద్ వాల్‌దాస్ బిజెపి నాయకులు ఉన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



ఎంపిడిఓ రాంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

**జగదేవ్‌పూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మరాఠి కృష్ణమూర్తి అన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే ఇవ్వాలని సోమవారం జగదేవ్‌పూర్ మండల ఎంపిడిఓ పి.రాంరెడ్డి, ఎంపిఓ ఖాజామొయినొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు గ్రీన్‌ఛానల్‌ద్వారా వేతనాలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ 12 గంటల పని విధానం అమలు చేయాలని కుట్ర చేస్తుందని, పెరుగుతున్న ధరలతో పాటు కార్మికుల కుటుంబాలు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనికి తగిన వేతనం అందించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. పారిశ్రామిక యాజమాన్యాల లాభాల కోసం బిజెపి ప్రభుత్వం కార్మికులందరికీ ద్రోహం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్తసమ్మెలో కార్మికసంఘాలు అన్నీపాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు యాదగిరి, కనకమ్మ, పంచాయతీ సిబ్బంది నవీన్, నర్సమ్మ, భూషణం, మల్లయ్య పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్ నేషనల్‌కు ఎంపికైన బివిఆర్ఐటి విద్యార్థి

**నర్సాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిరాజు ఇంజనీరింగ్ కళాశాలశాలలో సాంకేతికవిద్యాసంస్థ నందు కెమికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి కె. అనంతరావు థైవాన్ దేశంలోని నేషనల్ చెంగ్‌కుగ్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ టిఈఈపి తైవాన్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు బివిరాజు సాంకేతికవిద్యాసంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఒప్రకటనలో తెలియజేశారు. విద్యార్థి అనంతరావు తన ఇంటర్న్‌షిప్ సమయంలో రేడియేటివ్ కూలింగ్ మెటీరియల్స్ ఉత్ప్రేరకము, సిఓ సెపరేషన్పొరలపై దృష్టిసారించి అధునాతన పరిశోధన ప్రాజెక్టులో పాల్గొంటారు. ఇంటర్న్‌షిప్ జులై ఒకటవ తేదీ నుండి సెప్టెంబర్ 30 తేదీ వరకు ఇంజనీరింగ్ సైన్స్ విభాగంలో జరుగుతుందన్నారు. నెలవారి స్టయిపండు ఎన్‌టిఎస్ రూ.15000 ఇవ్వబడుతుందని తెలియచేశారు. శ్రీవిష్ణు విద్యాసంస్థల చైర్మన్ కె.వి విష్ణురాజు వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ సెక్రెటరీ ఆదిత్య వీసం విద్యార్థి అనంతరావును అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దుబే రీసెర్చ్ దీని డాక్టర్ రాజు కెమికల్ ఇంజనీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ భాను రాధిక అన్ని విభాగాల అధిపతులు ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ అన్ని విభాగాల అధ్యాపకులు, డీజీఎం కాంతారావు మేనేజర్ బాపిరాజు అసిస్టెంట్ మేనేజర్ సురేష్ విద్యార్థినీవిద్యార్థులు ఎంపికైన విద్యార్థిని అభినందించారు.

## ముగిసిన కుట్టు శిక్షణ-రాయితీపై మిషన్లు

**కంగ్టి, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలంలోని నాగూర్ (బి) గ్రామంలో గత 30 రోజులుగా కొనసాగిన ఉచిత కుట్టు శిక్షణ సోమవారంతో ముగిసింది. గ్రామానికి చెందిన మహిళలకు గ్రామ స్వరాజ్య కో-ఆర్డినేటర్ అలురే మహానంద కుట్టులో శిక్షణ కల్పించారు. కుట్టులో శిక్షణ పొందిన మహిళలకు 50 శాతం రాయితీపై కుట్టు మిషన్లు అందచేశారు. శిక్షణపొందిన మహిళలు భవిష్యత్తులో ఉపాధి అందుకుంటారని స్వరాజ్య కో-ఆర్డినేటర్ అలురే మహానంద పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన శాంతమ్మ, పూజ, సునీత, ప్రీతి, లక్ష్మి, భారతి, అనిత, అంబికా తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రేరియన్ నరసింహస్వామి సేవలు అభినందనీయం

**-పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు**

**గజ్వేల్ టౌన్, జూన్ 30 (ప్రభాతవార్త):**
గజ్వేల్ పట్టణంలోని జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వహించిన కెవి.నరసింహస్వామి సేవలు అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్‌సిహెచ్‌వి.కృష్ణారావు అన్నారు. సోమవారం లైబ్రేరియన్‌గా విధులు నిర్వహించిన నరసింహస్వామి పదవీవిరమణ సందర్భంగా కళాశాల ఆవరణలో ఘనంగాసన్మానించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణారావు మాట్లాడుతూ కళాశాలలో లైబ్రేరియన్‌గా మంచిసేవలు అందించడంతోపాటు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారని తెలిపారు. కళాశాలలో వారు చేసిన సేవలను ఎప్పటికీ మరిచిపోమని అన్నారు. ఈకార్యక్రమంలో మెకానికల్ హెచ్‌ఓడి డాక్టర్ బిట్ల వేణు, ఈసిహెచ్‌ఓడి సారంగపాణి, ఫిజికల్ డైరెక్టర్ డి.రవీందర్, కె.విశ్వనాథ్, శ్రీలత, కీర్తి, శ్రీదేవి, శ్రీధర్, స్వామి, హారతి, వైభవ్, విహాన్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు అందజేసిన ఉపాధ్యాయుడు

**కొండాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలంలోని బోటిలగుట్టతాండ ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ దాతృత్వాన్ని చాటుకున్నాడు. సోమవారం మండలవిద్యాధికారి దశరథ్ ఆధ్వర్యంలో తనసొంతడబ్బుతో విద్యార్థులకు బ్యాగులు, స్కెచ్‌పెన్సిల్, డ్రాయింగ్‌పెన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలవిద్యాధికారి దశరథ్ ఉపాధ్యాయుని అభినందిస్తూ ఇకముందు కూడా విద్యార్థులకు ప్రోత్సాహాన్నివ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎలిజబెత్, సిఆర్పి ఆనంద్, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటవస్తువులు అందజేసిన డాక్టర్

**గజ్వేల్, జూన్ 30 (ప్రభాతవార్త):**
గజ్వేల్ మండల పరిధిలోని కొండకండ్ల నరగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ స్నేహ సభ్యుడు డాక్టర్ కుమారస్వామి సోమవారం విద్యార్థులకు ఆటవస్తువులతోపాటు ఫ్రూట్‌జ్యూస్, బిస్కెట్లు అందజేశారు. వంట కార్మికులకు కుకింగ్ ఆప్రాన్‌లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

## ఇసాంసేట్‌కు నివాళులు అర్పించిన మాజీ మంత్రి

**జహీరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
అనారోగ్యంతో అనంత లోకాలకు చేరిపోయిన జహీరాబాద్ పట్టణానికి చెందిన రాయల్ ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని ఇసాం సేట్ మృతదేహానికి మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ ఆదివారం సాయంత్రం నివాళులు అర్పించారు. ఇసాం సేట్ కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి సానుబూతి ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మక్సూద్ ఆహ్మద్, హుగ్గెల్లి రాములు, వాజహత్, యూనుస్, మోఉయిజ్ సోహెల్, యువజనకాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

**-సంకల్ప స్వచ్ఛంద సంస్థలకు విద్యార్థులు కృతజ్ఞతలు**

**చౌటకూరు, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలపరిధిలోనిసింగూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు పాఠశాల గణితం ఉపాధ్యాయులు పైసా సిత్యం వినతి మేరకు హైద్రాబాద్‌లోని సంకల్పం స్వచ్ఛంద సంస్థ బాధ్యులు స్టడీ మెటీరియల్‌ను (స్కూల్‌బ్యాగ్, నోటుపుస్తకాలు) సోమవారం అందచేశారు. విద్యాదానం మహాదానం అని సంకల్పం బృంధం ఆర్గనైజర్ నందకిషోర్ గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు దాతలు తమవంతు సహకారం అందించాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయ సిబ్బంది, సంకల్పం బృంధం బాధ్యులు సూర్య మోహన్, శశాంక్, రాఘవ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఈసి గ్రూపులోచేరే విద్యార్థులకు ఉచిత స్టడీమెటీరియల్

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసి గ్రూపులో చేరే విద్యార్థులకు ఉచితస్టడీమెటీరియల్ అందచేయడం జరుగుతుందని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ హిస్టరీ లెక్చరర్ గూడూరి మల్లేశం చెప్పారు. సోమవారం గ్రూపులో చేరిన విద్యార్థులకు ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు ఉపకారవేతనాలు అందించడం జరుగుతుందన్నారు. అనుభవం గల లెక్చరర్లతో విద్యాబోధన అందించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన జర్నలిస్టులు

**చేర్యాల, జూన్ 30, ప్రభాతవార్త:**
జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రమాదవశాత్తు గాయపడి చికిత్సపొంది విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న చేర్యాల జర్నలిస్టులు సోమవారం హైదరాబాద్‌లోని వారినివాసంలో కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను పరామర్శించిన వారిలో జర్నలిస్టులు రాళ్లబండి గురుమూర్తి, చింతల అశోక్, నాంపల్లి రాజు, జాటోతు మహేందర్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు

**-వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాధిక**



కందివిత్తనాల సంచులను పంపిణీచేస్తున్న వ్యవసాయ జిల్లా అధికారి

**కొండపాక, జూన్ 30, ప్రభాతవార్త:**
చిరుధాన్యాల(పప్పు దినుసులు) సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక అన్నారు. సోమవారం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ రైతువేదికలో కందివిత్తనాల చిరుసంచుల పంపిణీ కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడారు. జాతీయ అహారభద్రతామిషన్ పథకంకింద విత్తనాలు చిరుసంచుల 40 (ఎల్ఆర్‌జి 41)రకం విత్తనాలను రైతులకు అందించడం జరిగిందని అమె తెలిపారు. పప్పుదినుసుల పంట విస్తీర్ణం గణనీయంగా పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారన్నారు. పంటవిస్తీర్ణం పెంపుతోపాటు పంప్పుదినుసుల సాగుద్వారా అధిక లాభాలు పొందాలని సూచించారు. పప్పు దినుసులను ప్రధాన పంటగా లేదా అంతరపంటగా సాగు చేయవచ్చునని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరామ కృష్ణ, ఏఎంసి వైస్ చైర్మన్ బట్ట పర్షరాములు, ఎఈఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్యాయత్నం

**శివ్వంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
శిక్ష పడుతుందని మనోవేదనకుగురై యువకుడు గడ్డిమందు తాగుతూ సెల్ఫీవీడియో తీసుకుంటూ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్థులుతెలిపిన వివరాలప్రకారం శభాష్‌పల్లి గ్రామానికి చెందిన పానగారి సుధాకర్‌పై గతంలో మైనర్‌బాలికపై అత్యాచారయత్నం చేయడంతో పోక్సో కేసు నమోదయింది. జైలుకు వెళ్లి వచ్చాడు. ఉరిశిక్ష పడుతుందేమోనని ఉద్దేశంతో నేను తప్పు చేయలేదంటూ సెల్ఫీ వీడియో తీసుకుంటూ గడ్డిమందు తాగుతూ ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నానని స్నేహితుడికి వాట్సప్‌లో వీడియో షేర్‌చేశాడు. అతని స్నేహితుడు వెంటనే 100 డయల్ కాల్ చేసి చెప్పాడు. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

## పశువైద్యుల నిర్లక్ష్యం వలనే పాడిగేదె మృతి

**శివ్వంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
పశువైద్యుల నిర్లక్ష్యం వల్ల పాడి గేదె మృతిచెందిన ఘటన గూడూరు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు గొల్ల ఆంజనేయులు తెలిపిన వివరాలప్రకారం తన పాడిగేదె గత వారంరోజులనుండి గడ్డి తినడంలేదని గేదె అనారోగ్యంతో లేవని స్థితిలో ఉందని పశు వైద్యులను సంప్రదించగా ఈరోజు వస్తాం రేపు వస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ ఉన్నారని, వచ్చి గేదెను పరీక్షించండి అని చెప్పినా రాలేదని, గేదె కూడా మృతిచెందిందని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. పశువైద్యులపై ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని తనకు న్యాయం చేయాలని రైతు గొల్ల ఆంజనేయులు కోరారు.

## కురిసిన వర్షం-మురిసిన రైతాంగం


న్యామతాబాద్‌లో కురుస్తున్న వర్షం

**న్యాల్‌కల్, జూన్ 30, ప్రభాతవార్త:**
రైతన్నలను కరుణించకుండా ముఖం చాటేసిన వరుణదేవుడు ఎట్టకేలకు కరుణించాడు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని ఆయా గ్రామాల్లో అరగంటపాటు మోస్తరువర్షం కురిసింది. ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని రైతులు పత్తి, సోయాబీన్, కందివిత్తనాలు విత్తుకుని వర్షాలకోసం మేఘాల వైపు ఎదురుచూస్తూ ఉన్నారు. వరుణుడు ఎంతకూ కరుణించకపోతుండటంతో అన్నదాతల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని ఏ కూడళ్లను పరిశీలించినా రైతులు వాన ఎప్పుడొస్తది, మొలకలు ఎండిపోతున్నాయని చర్చించుకోవడంకానవచ్చింది. వర్షాల కొరకు రైతులు ఆలయాల్లో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఏదేమైనా సోమవారం వరుణుడు కరుణించడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది.

## సిఐని కలిసిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్


సిఐని కలిసిన మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్

**సదాశివపేట, జూన్ 29, ప్రభాతవార్త:**
సదాశివపేటలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ వెంకటేష్ ను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, డైరెక్టర్లు పట్లోళ్ల శివకుమార్, బుసన్నగారి శైలేందర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుఫ్ జిల్లా బిసియువత అధ్యక్షులు జావేద్, ఏదుల సంగమేశ్వర్ కలిశారు.

## నూతన సిఐ, ఎస్సైలను సన్మానించిన టిఆర్ఎస్ నాయకులు


సిఐ, ఎస్సైలను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కొండాపూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలంలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సిఐ సుమన్ కుమార్ ఎస్సై సోమేశ్వరి,ఇటీవల బదిలీపై మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సత్తయ్య ను బిఆర్ ఎస్ నాయకులు సోమవారం నాడు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షులు విఠల్,ఆధ్వర్యంలో మండల నాయకులు, మాజీ సర్పంచులు ఎంపిటీసీలు, మండల పార్టీ సీనియర్ నాయకులు మల్లా గౌడ్, రామచంద్రయ్య,మాజీ వైస్ ఎంపీపీ డి.ప్రేమానందం పి గోవర్ధన్ రెడ్డి, నగేష్ ముదిరాజ్, డి నాగయ్య,మాజీ సర్పంచులు ఎండి రుక్మద్దీన్, అరవింద్ రెడ్డి, ఎండి ఫహీం, జాలిల్ ఇంద్రారెడ్డి, పి ప్రకాష్,లు పాల్గొని పూలమాలలతో శాలువాలతో సన్మానించారు.

## నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ అండ

**నారాయణఖేడ్/కల్హేర్, జూన్ 29, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మాజీ పిసిసిఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవరెడ్డి ఆదేశాలమేరకు సోమవారం మండలకేంద్రమైన కల్హేర్ లోఇందిరమ్మ ఇండ్లనిర్మాణం కొరకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందె దుర్గవ్వ, నర్ముల లక్ష్మి కి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నేడు వారి ఇండ్లనిర్మాణంకోసం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాజీ పిసిసిఎస్ చైర్మెన్ మహిపాల్‌రెడ్డి, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ ఎండి సర్దార్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకుడు దేవదాస్,మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సత్యాగౌడ్, గ్రామయువజనకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరుడి రాఘవేందర్, గ్రామకార్యదర్శి కృష్ణచారి, రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేష్‌గౌడ్**

**మర్కుక్, జూన్ 30, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బబ్బూరి మల్లేష్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలకేంద్రం మర్కుక్‌లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, వంటిమామిడి ఏఎంసి డైరెక్టర్ శంకర్, పంచాయతీ కార్యదర్శి శాంతి, నాయకులు యాదగిరి, జైపాల్‌రెడ్డి, నర్సింలు, బిక్షపతి, హరిశంకర్, జీవన్‌రెడ్డి, ఇసుకంటి బాబు, నవీన్, పెంబర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జానకంపేటలో హరితహారం చెట్లు నరికివేత

**-జానకంపేట మాజీ సర్పంచ్ పాండుయాదవ్**


నరికిన చెట్టును చూపిస్తున్న మాజీ సర్పంచ్ పాండుయాదవ్

**అమీన్‌పూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జానకంపేటలో హరితహారంలో భాగంగా గతంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రోడ్‌కి ఇరువైపులా నాటిన మొక్కలు గొడ్డలివేటుకు గురవుతున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం మొక్కలు నాటుతుంటే మరోవైపు కొందరు వ్యక్తులు పచ్చనిచెట్లను నరికివేస్తున్నారు. ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలకు తావిస్తుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌పరిధిలోని జానకంపేట గ్రామంలో ప్రధాన రహదారి గ్రామంలో సుమారు 4వేల మొక్కలను హరితహారం భాగంగా గతంలో నాటారు. కొంతమంది రాత్రికిరాత్రి జెసిబిలతో ఆచెట్లను తొలగిస్తున్నారని మాజీ సర్పంచ్ పాండుయాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు. చెట్లను నరికి వేస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన కోరుకున్నారు.

# రామాయంపేటలో 7.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**-కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాతరావు వెల్లడి**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుప్రభాతరావు

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణంలో మంగళవారం 7.5 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావ్ శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో మాట్లాడారు. బస్సుస్టాండ్ నుండి ఎంఆర్‌ఓ కార్యాలయం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి 100లక్షలతో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే సగర (ఉప్పర) సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎనిమిది లక్షలు, 5వవార్డులో హెచ్‌పి పెట్రోల్ పంపు ప్రక్కన మురికికాలువలు, సిసిరోడ్డు నిర్మాణానికి 50లక్షలు, 5వవార్డు రెడ్డికాలనీలో మురికికాలువలు, సిసిరోడ్డు నిర్మాణానికి 100 లక్షలు, అదే 5వవార్డు రెడ్డికాలనీలో పంచముఖి హనుమాన్ ఆలయం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఐదులక్షలు, పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 8లక్షలు, మల్లన్న ఆలయం వద్ద యాదవసంఘము కమ్యూనిటీ హాల్‌నిర్మాణానికి 10లక్షలు, 5వవార్డులో మంజీర స్కూల్ వద్ద మురికి కాలువలు, సిసి రోడ్డు నిర్మాణానికి 100లక్షలు, రజక సంఘం వద్ద (సిద్దిపేట రోడ్) కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 8లక్షలు, 1వవార్డులో మురికికాలువలు, సిసి రోడ్డు నిర్మాణానికి 70లక్షలు, ఇందిరమ్మ విగ్రహం నుండి సుభాష్‌చంద్రబోస్ విగ్రహం వరకు మురికి కాలువలు, సిసిరోడ్డు నిర్మాణానికి 100లక్షలు, 1వ వార్డులో స్కూల్ వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపనకు ఎనిమిదిలక్షలు, (మాదిగ వాడ) 1వవార్డులో పోచమ్మ ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్‌నిర్మాణానికి (మాలవాడ) 8లక్షలు, మార్కండేయ మందిరం (పద్మశాలిసంఘం) వద్ద షెడ్‌నిర్మాణం కోసం 5లక్షలు, మున్నూరుకాపు సంఘం వద్ద కమ్యూనిటీ హాల్‌నిర్మాణానికి శంకుస్థాపనకు 8లక్షలు కేటాయించడం జరిగిందని, ఈ పనులన్నింటికీ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగిన అభివృద్ధి పనులన్నీ రెండు మూడు రోజుల్లో ప్రారంభమౌతాయన్నారు.

## పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించే ప్రసక్తే లేదు

**-టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాసశర్మ**

**రామాయంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
పత్రికాస్వేచ్ఛను హరించేవిధంగా దాడులుచేస్తే ఊరుకునేదిలేదని టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి శ్రీనివాసశర్మ అన్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో సోమవారం జర్నలిస్టు సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మహాటివి ఛానల్‌పై బిఆర్ఎస్‌పార్టీ నాయకులు దాడిచేసి, ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద దాడికి నిరసనగా ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన జర్నలిస్టులు తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం సమర్పించారు. మహాటివి ఛానల్‌పై దాడిచేసిన బిఆర్ఎస్ నాయకులపై హత్యానేరంకింద కేసు నమోదుచేసి అరెస్టుచేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. మహాటివి కార్యాలయంపై దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో జెఎసి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పటేరి రాము, జర్న లిస్టులు చంద్రపు అమరేందర్‌రెడ్డి, పాతూరి రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కర్రె నరేందర్, రామారపు యాదగిరి, తుజాల శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రారెడ్డి, సార్గూ నర్సింలు, శ్రీరామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితవిద్యాపథకం నిధులు మంజూరు చేయాలి

**-రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్‌కు డిబిఎఫ్ నాయకుల వినతి**


రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పి.శంకర్

**గజ్వేల్, జూన్ 30, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్తంగా గత మూడుసంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పథకం కింద విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో ఎస్సి విద్యార్థులు నరకయాతన పడుతున్నారని రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు దళిత బహుజన ఫ్రంట్ జాతీయకార్యదర్శి పి.శంకర్ వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 180 ప్రైవేట్ పాఠశాలలో బెస్ట్ అవైలబుల్ ఉచిత విద్యాపథకం కింద ఒకటవతరగతి నుండి పదవతరగతి వరకు డేస్కాలర్, రెసిడెన్షియల్‌లో 26వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు దాటుతున్నా, నేటికీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్చుకోకపోవడంతో విద్యార్థులభవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులను, విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఈవిద్యాసంవత్సరంలో పాఠ్య, నోటుపుస్తకాలను నేటికీ అందజేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనేస్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్సి,ఎస్టి కమిషన్ దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. అనంతరం ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికితీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, రాజేష్, మక్తల్ పృథ్వీరాజ్, శ్రీను, బ్యాగరి వేణు, సుధాకర్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డైరెక్టర్ కిష్టయ్య మృతి బాధాకరం

**-మెదక్ మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి**

**పాపన్నపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పాతలింగయిపల్లిగ్రామానికి చెందిన సీనియర్ నాయకులు, ఏడుపాయలదేవస్థానం మాజీ ధర్మకర్త కిష్టయ్య మృతిపట్ల బిఆర్ఎస్ పార్టీ మెదక్‌జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి తీవ్రసంతాపం వ్యక్తంచేశారు. కిష్టయ్య గుండెపోటుతో మృతిచెందారని తెలిసి వారు తీవ్రవిచారం వ్యక్తంచేశారు.

## బొమ్మారెడ్డిగూడెంలో మద్యం విక్రయాలు నిషేధం

**-ఉల్లంఘిస్తే రూ.50వేల జరిమానా**



మద్యంవిక్రయాలను నిషేధిస్తూ తీర్మానపత్రాలు అందచేస్తున్న దృశ్యం

**చౌటకూరు, జూన్ 30, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలోని కిరాణ కొట్టుల్లో మద్యం విక్రయాలు చేపట్టకూడదని తండావాసులు తీర్మానం చేసుకుని తండాలోని దుకాణదారులకు తీర్మానపత్రాలు అందచేశారు. కిరాణ దుకాణాల్లో మద్యం అమ్మకాలు కొనసాగుతుంటంతో తండావాసులు పనులకు వెళ్లకుండా సమయం సందర్భంలేకుండా మద్యం సేవిస్తూ ఆరోగ్యాలు పాడుచేసుకోవడమే కాకుండా కుటుంబాలను రోడ్డుపైకి తెస్తుండటంతో తండా యువకులు స్పందించి తండాలో బెల్టుషాపులు నిర్వహించవద్దని తీర్మానం చేసుకున్నారు. గిరిజనతండాతో పాటు గ్రామంలో సైతం మద్యం విక్రయాలు నిషేధం అని తీర్మానంచేసి తీర్మానపత్రాలను దుకాణదారులకు అందచేశారు. తీర్మానాన్ని వ్యతిరేకించి మద్యం అమ్మితే రూ.50వేలు జరిమాన విధిస్తామని యువజన సంఘం నాయకులు గణపతినాయక్ తీర్మానపత్రంలో పేర్కొన్నారు. ప్రజలతో మద్యంకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

## జిల్లాలో నెలరోజులు పోలీసు యాక్ట్ అమలు

**-జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్**

**సంగారెడ్డి టౌన్, జూన్ 30, ప్రభాతవార్త:**
శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని జులై 1వ తారీఖు నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతిభద్రతలకు భంగంకలిగేవిధంగా, ప్రజాధనానికి నష్టంవాటిల్లే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టఊడదన్నారు. జిల్లా ప్రజలు, ఆయా సంఘాల నాయకులు పోలీసులకు తమ వంతు సహకరించాలని ఎస్‌పి పరితోష్ పంకజ్ జిల్లా ప్రజలకు సూచించారు.

## ఎంపి రఘునందన్‌రావు త్వరగా కోలుకోవాలి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎడ్ల రమేష్**

**అమీన్‌పూర్, జూన్ 30, ప్రభాతవార్త:**
మెదక్ ఎంపి రఘునందన్‌రావు త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నానని ఎడ్ల రమేష్ తెలిపారు. కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావును బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎడ్ల రమేష్ సోమవారం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## మహాన్యూస్‌పై దాడికి జర్నలిస్టుల నిరసన!

**-కలెక్టరేట్లో టియుడబ్ల్యుజె వినతిపత్రం**

**సంగారెడ్డి, జూన్ 30, ప్రభాతవార్త:**
హైదరాబాదులోని మహాన్యూస్ కార్యాలయంపై దుండగుల దాడిని సంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు తీవ్రంగా నిరసించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపుకలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. టియుడబ్ల్యుజె ఐజెయు జిల్లాశాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ పార్టీలు ఏవైనా, వ్యక్తులు ఎవరైనా మీడియాపైదాడులు సరికాదని అన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి విష్ణుప్రసాద్, రాష్ట్ర హౌసింగ్ సభ్యుడు అన్వర్, ఎలక్ట్రానిక్ మీడియావిభాగం జిల్లా ప్రధానకార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్ధిఖ్, ఆరిఫ్, శ్రీనివాస్,మల్లేశం,విల్సన్,ప్రభు,పాండు,సంతోష్ పాల్గొన్నారు.

# దమ్ముంటే భూకబ్జాలపై విచారణ జరిపించండి

**-కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు బిఆర్ఎస్ భయపడదు**



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**హుస్నాబాద్ రూరల్, జూన్ 30, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే భూకబ్జాల ఆరోపణలపై వెంటనే విచారణ జరిపించాలని బిఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు అన్వర్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జునరెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణకేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్ హయాంలో బిఆర్ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ హయాంలో భూకబ్జాలు జరిగాయని ఆరోపించే నాయకులు దమ్ముంటే వెంటనే విచారణ చేపట్టి కబ్జాదారుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. మాటిమాటికీ మాజీ ఎమ్మెల్యే ఏం అభివృద్ధి చేశారు అని అడుగుతున్న కాంగ్రెస్ నాయకులకు సతీష్‌కుమార్ హుస్నాబాద్‌ను పది వేల కోట్లతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా సతీష్‌కుమార్ తీసుకొచ్చిన నిధుల కంటే రాష్ట్ర మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఒక్క రూపాయి ఎక్కువ అభివృద్ధి చేసినా ఆయనే గొప్పవారని ఒప్పుకుంటామన్నారు. ఆయన చేసిన కార్యక్రమాలు తీసుకొచ్చిన నిధుల గురించి శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. నాలుగు రోజుల క్రితం హుస్నాబాద్‌లో జరిగిన సభలో బిఆర్ఎస్ హయాంలో హుస్నాబాద్ అభివృద్ధి జరగలేదు అని అన్నందుకే మాజీ శాసనసభ్యులు సతీష్‌కుమార్ వారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించాలని గుర్తుచేశారు తప్ప ఎలాంటి విమర్శలు చేయలేదని గుర్తుచేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలపై మాట్లాడితే బెదిరింపులకు దిగుతున్న కాంగ్రెస్ నాయకులకు బిఆర్ఎస్ భయపడదన్నారు. ఇప్పటికైనా అనవసరపు ఆరోపణలు మానుకుని ఎన్నికల హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు గురించి ఆలోచన చేయాలని హితవు పలికారు.
సమావేశంలో పార్టీ నాయకులు బొజ్జ హరీష్, మేకల వికాస్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, గడ్డం సదానందం, రాజునాయక్, రాజేందర్‌రెడ్డి, కందుకూరి సతీష్ తదితరులు ఉన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

**బెజ్జంకి, జూన్ 30, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఎల్లంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో 6,7 తరగతుల్లో 50, 9,10 తరగతుల్లో 16 చొప్పున ఖాళీలు ఉన్నాయని భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాలోతు సంగీత సోమవారం తెలిపారు. అలాగే గణితశాస్త్రం బోధనకై ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందని అందుకుగానూ గ్రాడ్యుయేషన్ ఎమ్మెస్సీ, బిఈడి, టెట్‌లో ఉత్తీర్ణులైనవారు తమ బయోడేటా జిరాక్సులను జతపరిచిన దరఖాస్తులను ఆదర్శ పాఠశాలలో అందజేయాలన్నారు.

## రిటైర్మెంట్ ప్రయోజనాలు వెంటనే అందించాలి

**-తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్**



ఉపాధ్యాయులు గోపాల్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**జహీరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:**
పదవీ విరమణ పొందిన వారికి అందాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో తెలంగణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా సేవలు అందించిన ఉపాధ్యాయులు గోపాల్ పదవీ విరమణ పొందిన సందర్భంగా పట్లోళ్ల గోపాల్ దంపతులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు సంక్షేమానికి గోపాల్ అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివన్న, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్ దేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బస్వరాజ్, నర్సింహారెడ్డి, జిల్లా బాధ్యులు రమేష్, చంద్రశేఖర్, పెంట్యా నాయక్, సుధాకర్, వినయ్‌కుమార్,చంద్రకాంత్, తుక్కప్ప, నర్సింలు, శ్రీపాల్, విజయ్‌కుమార్, కృష్ణమోహన్, మల్లయ్యస్వామి,మొగులయ్య, చంద్రశేఖర్, అన్నపూర్ణ, యాదయ్య, రమేష్ నాయక్, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## జైపాల్‌రెడ్డి దంపతులను సన్మానించిన ఉపాధ్యాయులు



జైపాల్‌రెడ్డి దంపతులు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**న్యాల్‌కల్, జూన్ 30, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పదవీవిరమణ పొందిన బి. జైపాల్‌రెడ్డిని సోమవారం ఘనంగాసన్మానించి వీడ్కోలుపలికారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవీవిరమణ ఆత్మీయవీడ్కోలుసభలో జైపాల్‌రెడ్డి దంపతులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందచేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచ్చిదానంద రెడ్డి, ఉపాధ్యాయులు మొగులయ్య, సునీత, జ్యోతి, రాము, శ్రీనివాస్, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయికి సఫియా సుల్తానా ఎంపిక


ప్రధానోపాధ్యాయులు సఫియాసుల్తానాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**న్యాల్‌కల్, జూన్ 30, ప్రభాతవార్త:**
వినూత్నరీతితో విద్యాబోధన పద్ధతులలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైన మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలోని ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు సఫియా సుల్తానాను మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన సఫియా సుల్తానా జులై3 నుంచి 17వ తారీఖువరకు ఢిల్లీలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున సోమవారం పాఠశాల నుంచి రిలీవ్ ఆర్డర్‌లు ఇవ్వడంతో సఫియాసుల్తానా ఢిల్లీకి పయనమయ్యారు. సఫియాసుల్తానా జిల్లా, రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఎంపిక కావడం మండలానికి ఆదర్శంగా ఉందని, జాతీయస్థాయిలో సైతం మంచిప్రదర్శన కనబర్చి జిల్లాకు మంచిపేరు తేవాలని మిర్జాపూర్ జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్ ఆకాంక్షించారు. సఫియాసుల్తానాను సన్మానించినవారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## 12సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అందజేత..


ఫోన్లను రికవరీ చేసిన దృశ్యం

**పాపన్నపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
ఇటీవల పోగొట్టుకున్న 12 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ఇప్పటివరకు 283 సెల్ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సిఈఐఆర్ వెబ్సైట్ ద్వారా వీటిని రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కాగా పాపన్నపేట ఎస్సై రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి పోగొట్టుకున్న సెల్ఫోన్లను పెద్ద ఎత్తున రికవరీ చేయడం పట్ల బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పౌరులు తమ హక్కులను పొందాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మన్నన్

**చిన్నశంకరంపేట, జూన్ 30, ప్రభాతవార్త:**
సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని తహసీల్దార్ మన్నన్ అన్నారు. సోమవారం మండలపరిధి కామారంగ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్థుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి రాజు, ఆశావర్కర్లు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.